క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని తిరుమల ఆస్పత్రి ఎం.డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అన్నారు. స్థానిక తిరుమల ఆస్పత్రిలో మంగళవారం రైలు ప్రమాద క్షతగాత్రుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడగలడని తెలిపారు. అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.ఎస్.వి.రామారావు, డాక్టర్ మహేష్, అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన హెచ్‌పీసీఎల్ రిటైర్డ్ జీఎం



రిటైర్డ్ జీఎం కృష్ణంరాజును సత్కరిస్తున్న చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని హెచ్‌పీసీఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ కృష్ణంరాజు మంగళవారం సందర్శించారు. వర్సిటీలో పర్యటించి అమలు చేస్తున్న కోర్సులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విశ్వ విద్యాలయం అమలు చేస్తోన్న నైపుణ్య కోర్సులు చాలా బాగున్నాయని ఆయన కితాబిచ్చారు. అనంతరం చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి, ఐక్యూఏసీ డీన్ రమణారావు, డీన్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో తీవ్ర గాయాలతో కార్యదర్శి శంకర్రావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న డి.శంకర్రావు సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సతివాడ పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓ విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో విజయనగరంలోని ద్వారపూడి బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న బైక్, కార్యదర్శి బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్యదర్శి శంకర్రావుకు ఎడమ కన్ను పూర్తిగా పోవడంతో పాటు దవడ ఎముకలు విరిగిపోయాయి. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 సహకారంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పరిహారం



మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

రామభద్రపురం: ప్రభుత్వ నింబధనల ప్రకారమే ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములకు పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. మండలంలోని ఆరికతోట గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆమె మెంటాడ మండలంలో ఏర్పాటు చేయనున్న గిరిజన వర్సిటీ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన భూమి కోసం గ్రామ రైతులతో సమావేశమై, చర్చలు జరిపారు. ఆరికతోట రెవెన్యూ పరిధిలోని రైతులకు సంబంధించిన 98 సెంట్ల భూమి వర్సిటీ రోడ్డుకు అవసరమని, రైతులు భూమి ఇచ్చి, సహకరించాలని కోరారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ల్యాండ్ ఎక్విజియేషన్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనల మేరకు భూమి పోగొట్టుకుంటున్న రైతులకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎ.సులోచనరాణి, దత్తిరాజేరు తహసీల్దారు రమేష్, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవో సందర్శన

బొబ్బిలి: మండలంలోని చింతాడ గ్రామ పాఠశాలను డిప్యూటీ ఈవో పి.బ్రహ్మాజీరావు మంగళవారం సందర్శించారు. తొలుత ఆయన పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రుచి, శుచితో కలిగిన మధ్యాహ్న భోజనం రోజూ పిల్లలకు పెట్టాలన్నారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు గమనించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సవరవిల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవిల్లిలో గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ తిరుగుతూ లబ్ధిదారులకు బ్రోచర్లు అందించి వారి యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగున్నరేళ్లలో ఎంత లబ్ధి పొందారో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రజలకు అందాల్సిన ప్రజాధనాన్ని టీడీపీ నాయకులు గతంలో లూటీ చేసి దాచుకున్నారన్నారు. పలు కేసుల్లో ఇరుక్కుని దొంగలా దొరికిన చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్ కనుమరుగవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పైసా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నారన్నారు మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులవుతున్న ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థను నెలకొల్పి అర్హుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, సుందర హరీష్, కొల్లు రామ్మూర్తి, దల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తహసీల్దార్ చింతా బంగార్రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

డెంకాడ: అర్హులైన వారందరూ ఓటు హక్కును పొందాలని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ (ఎస్‌వీఈఈపీ) యాప్ ద్వారా ఓటు హక్కు నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ యువత ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కు పొందడం, దానిని వినియోగించడం బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పాటులో ఓటర్లే కీలకమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ క్రాంతి మాట్లాడుతూ తాజాగా ఓటరు నమోదు కోసం ఫారం–6ను ఉపయోగించాలన్నారు. దిద్దుబాటు కోసం ఫారం–8 , తొలగింపుల కోసం –7లను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ డీన్ ఎస్.మోహనకుమార్, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పోస్టల్ సేవలు

భోగాపురం: మండల కేంద్రంలోని స్థానిక తపాలా కార్యాలయంలో మంగళవారం తలెత్తిన సాంకేతిక కారణాల వల్ల నెటవర్క్ పని చేయ లేదు. దీంతో తపాలా కార్యాలయంలో పోస్టల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. పోస్టల్ సేవల కొరకు తపాలా కార్యాలయానికి వచ్చిన కస్టమర్లు ఇబ్బందులకు గురయ్యారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

నెల్లిమర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ అన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అవగాహనపై అందరూ సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మేనేజర్ విశ్వేశ్వరరావు, మెప్మా సీఎం డి.గోవిందరావు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామిత్వ కార్యక్రమంపై లఘు చిత్రం షూటింగ్



పెద్ద బూరాడపేటలో లఘు చిత్రం చిత్రీకరణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద్ద బూరాడపేటలో స్వామిత్వ కార్యక్రమంపై లఘు చిత్రం షూటింగ్ మంగళవారం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన జగనన్న భూ హక్కు, భూరక్ష కార్యక్రమంపై ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలో పలు సన్ని వేశాలను చిత్రీకరించారు. పెద బూరాడపేటకు చెందిన నాయకుడు మక్కువ రమణ, కొండవెలగాడ సచివాలయంలో ఆరోగ్య కార్యదర్శిగా పని చేస్తున్న మాధవి, దన్నానపేట కార్యదర్శిగా పని చేస్తున్న సంతోష్ నటీ, నటులుగా పలు సన్నివేశాలను తెరకెక్కించారు. ఈ లఘు చిత్రంలో స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేశారు.

నవజాత శిశువులను సంరక్షించండి

- ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రమ్య



మాట్లాడుతున్న ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రమ్య

విజయనగరం ఫోర్ట్: నవజాత శిశువులను సంరక్షించాలని, వారి పట్ల తల్లిదండ్రులు, ఆరోగ్య సిబ్బంది జాగ్రత్త వహించాలని ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.రమ్య అన్నారు. ప్రపంచ నవజాత శిశువు సంరక్షణ దినం సందర్భంగా ఫూల్‌బాగ్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నవజాత శిశువుల ఆరోగ్యంపై వైద్యుల సూచించిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఆడపిల్ల అయితే గర్భంలోనే తుంచడం చట్ట రీత్యా నేరమని వెల్లడించారు. డీఐఓ అచ్యుత కుమారి మాట్లాడుతూ ప్రపంచంలో ఏడాదికి 1,17,500 మంది శిశువులు మరణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ శిబిరానికి స్పందన



ఎంఎస్ఎన్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

విజయనగరం: నగరంలోని ఎంఎస్ఎన్ కాలనీలో 37, 38వ నంబరు సచివాలయాల పరిధిలో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. శిబిరంలో జొన్న గుడ్డి, సాయినాథ్ కాలనీ ప్రాంతాల ప్రజలు వైద్య సేవలను పొందారు. ముందుగా వలంటీర్ల ద్వారా సర్వే చేపట్టి వైద్య శిబిరానికి వెళ్లే విధంగా ప్రజలలో అవగాహన కల్పించారు. దీంతో పెద్ద ఎత్తున జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి స్పందన లభించింది. ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి రిఫరల్ చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. బాలామృతంతో చేసిన పదార్థాలను ప్రదర్శించారు. స్థానిక కార్పొరేటర్లు పాల్గొని ప్రజలను చైతన్యపరిచారు.

మూఢనమ్మకాలను విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలు ఇంకా మూఢ విశ్వాసాలతో ఉండడం బాధాకరమని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి ఆవేదన వ్యక్తం చేశారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నిరక్షరాస్యత, అజ్ఞానం వంటి కారణాలతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న అమాయక ప్రజలను మభ్యపెట్టి కొందరు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని, చదువుకున్న యువత మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ప్రభాత్, అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ‘పల్లెబాట’



మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

రామభద్రపురం: మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమామణి తెలిపారు. స్థా నిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో మంగళవారం సమావేశమైన ఆమె కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాల ద్వారా ఎంతమంది లబ్ధి పొందారు.. ఎంత లబ్ధి పొందారో తెలియజేయాలన్నారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు కూడా వివరించాలన్నారు. కార్యక్రమం చేసే ముందురోజు అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం వెచ్చిన ఖర్చు జాబితాను ప్రదర్శించాలని, ఆ మరుసటి రోజు ప్రతీ ఇంటికి వెళ్లి, వాటిని వివరించాలన్నారు.

ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల ప్రారంభం

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనంతో పాటు రంగరాయపురం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం(ఆర్‌బీకే) భవనాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన సాధ్యమన్నారు.

ప్రతీ గ్రామంలో ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ, దాని పరిధిలోని వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతోందన్నారు. రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతు భరోసా పథకం కింద నియోజకవర్గంలోని 43 వేల మంది రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు రూ.81.59 కోట్ల నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఎస్.వేణుగోపాల నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యు.అప్పలనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ టి.దామోదరరావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, సర్పంచ్‌లు జి.అప్పారావు, యు.గోవింద, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.శ్రీరాములు, పీఆర్ డీఈఈ అప్పారావు, వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



రాజగిరి బంగారమ్మ తల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని వుడా కాలనీలో వేంచేసి ఉన్న రాజగిరి బంగారమ్మ తల్లి ఉత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వెంటనే ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పులి వేషాలతో, డప్పు వాయిద్యాలతో ఆలయం వరకు తోడ్కొని వెళ్లారు. బంగారమ్మ మూలవిరాట్‌ను దర్శించుకున్న ఆయన కొద్దిసేపు ఉత్సవ నిర్వహణ గూర్చి కమిటీ సభ్యులతో చర్చించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ మహాశక్తి స్వరూపిణి అయిన బంగారమ్మ తల్లి ఈ ప్రాంత ప్రజలకు చల్లగా కాపాడుతూ వస్తోందన్నారు. ఇదే నమ్మకంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు ప్రతి ఏటా ఘనంగా బంగారమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక పెద్దలు ఉత్సవ కమిటీగా ఏర్పడి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆ తల్లి చల్లని దీవెనలు ప్రతి ఒక్కరిపైన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణప్పడు, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటరమణ, శంకరరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాల ప్రదర్శన

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: గడిచిన నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అమలు చేసిన వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందిన వారి వివరాలను ప్రతి సచివాలయంలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసి ప్రదర్శించాలని విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పివిడి ప్రసాదరావు సూచించారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా ఈ నెల 9వ తేదీ నుంచి డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించాలని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, ఏ ఏ పథకాలలో ఎంత మొత్తంలో పొందారనే వివరాలు బోర్డుల్లో పొందుపరచాలని పేర్కొన్నారు. ఇందు కోసం ప్రతి సచివాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్టు చెప్పారు. డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఏఓ మూర్తి, టీపీఆర్ఓ సింహాచలం, సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు

డెంకాడ: మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీన డెంకాడలో జరుగుతుందన్నారు. 10వ తేదీన చింతలవలస–1, 14న చింతలవలస–2 సచివాలయం పరిధిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. 15వ తేదీన పెదతాడివాడ, 16 పినతాడివాడ, 17న రఘుమండ గ్రామాల్లో జరుగుతుందన్నారు. 20న మోపాడ, 21న గుణుపూరుపేట, 22న అక్కివరం, 23వ తదీన అమకాం గ్రామాల్లో జరుగుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయాల వద్ద సంక్షేమ పథకాల వివరాలు ప్రజలకు వివరించి, బోర్డును కూడా ఏర్పాటు చేస్తారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.లింగేశ్వరరెడ్డి స్థానిక ఎస్ఎస్ఏ కార్యాలయంలో ట్యాబ్‌లను మంగళవారం అందజేసారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ సాధనాల ద్వారా విద్యను సులభతరం చేసేందుకు ట్యాబులను అందిస్తున్నామని తెలిపారు. ఈ ట్యాబులో వినికిడి, దృష్టి వైకల్యం గల విద్యార్థులకు ఉపయోగపడే సాఫ్ట్‌వేర్, ఇతర యాప్‌లను ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. విద్యార్థులు వీటిని సవ్యంగా వినియోగించేటట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న మొత్తం 209 ట్యాబ్‌లలో 106 మంది వినికిడి వైకల్యం వారికి, 20 మంది దృష్టి లోపం వారికి, 83 మంది ప్రత్యేక ఉపాధ్యాయులకు పంపిణీ చేసామని తెలిపారు. ట్యాబ్‌ల వినియోగంపై రిసోర్స్ పర్సన్లుగా కె.ఈశ్వరరావు, సునీల్ స్పెషల్ అవగాహన కలిగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఫైనాన్షియల్ అధికారిణి వి.కృష్ణవేణి, సహిత విద్య సహ కోఆర్డినేటర్ ఎం.భారతి, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి : ఎస్పీ



ఎం.దీపిక, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలోని విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, బొబ్బిలి, నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నివసిస్తూ పండగలకు, పుణ్యక్షేత్రాలకు, స్వంత పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలందరూ తమ ఇళ్లల్లో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎస్పీ ఎం.దీపిక ప్రజలను కోరారు. ఈ ప్రాంత వాసులకు సంబంధించి 50 కెమెరాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ దొంగతనాల నివారణకు పోలీసు శాఖ లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రత్యేకంగా రూపొందించి, భద్రతను మరింత పటిష్టం చేసిందన్నారు. ప్రజలకు ఈ విధానం పట్ల అవగాహన లేకపోవడం వలన అవసరాల నిమిత్తం ఇళ్లు విడిచి బయట ప్రాంతాలకు వెళ్లే ప్రజల ఇళ్లల్లో దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. తాము ఇళ్లు విడిచి బయటకు వెళ్తున్నట్లుగా సంబంధిత పోలీసు స్టేషన్‌కు ముందస్తు సమాచారాన్ని అందిస్తే స్థానిక పోలీసులు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు. ఇళ్లు విడిచి బయటకు వెళ్లే వారందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని దొంగతనాలు నివారించడానికి సహకరించాలని ప్రజలకు ఎస్పీ కోరారు.

15న చలో విజయవాడ

విజయనగరం ఫూల్‌బాగ్: విజయవాడలో ఈ నెల 15న జరగనున్న ప్రజా రక్షణ భేరికి జిల్లా నుంచి ప్రజలు తరలి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. ఇందుకుగాను నగరంలోని బాబామెట్టలో, 3, 4 వార్డుల్లో ఇంటింటి ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా, రావాల్సిన నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాషా, తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై దర్యాప్తు



బూరాడలో భూ ఆక్రమణపై దర్యాప్తు చేస్తున్న తహసీల్దారు సుదర్శనరావు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న విషయంపై తహసీల్దారు సుదర్శనరావు మంగళవారం దర్యాప్తు చేపట్టారు. భూమి ఆక్రమణకు గురికావడమే కాకుండా వేరే వ్యక్తుల పేరిట దానిని గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన కల్యాణచక్రవర్తి మార్చినట్లు సోమవారం జరిగిన జిల్లా స్పందనలో ఫిర్యాదు అందిందని, ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలతో దర్యాప్తు చేస్తున్నామని తహసీల్దారు తెలిపారు. తొలుత తహసీల్దారు ఆక్రమణకు గురైన భూమి వద్దకు చేరుకుని, రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ఆరాతీశారు. అలాగే ఫిర్యాదు చేసిన సమతా సైనికదళ్ ఇన్‌చార్జ్ తేగల మోహనరావు వద్ద నుంచి ఆధారాలు, వివరాలను సేకరించారు. తమ పరిశీలనలో గమనించిన విషయాలను కలెక్టర్‌కు తెలియజేస్తామని తహసీల్దారు తెలిపారు.

పత్రికా ప్రకటన

అందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కోరాడ సైదిరాజు S/o. అప్పయ్య (లేటు) [illegible] గ్రామం, విజయనగరం మండలం, విజయనగరం జిల్లా వారు కోరాడ అప్పారావు మరియు ఇతరులపై సివిల్ దావా పార్టిషన్ సూట్ ఓ.ఎస్.నెం. 11/2023, ఐ.ఎ.నెం. 123/2023 సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో దాఖలు చేయబడియున్నది.

ఆస్తి వివరములు: విజయనగరం మండలం, [illegible] గ్రామంలో యున్నటువంటివి.

ఐటం నెం–1: ఆర్.సి.సి.శ్లాబ్ [illegible] నివేశనములు, డోరు నెం.1–35, సర్వే నెం.102, విస్తీర్ణం యు.0–06 సెంట్లు గ్రామకంఠం. ఐటం నెం–2: ఆర్.సి.సి.శ్లాబ్ [illegible] నివేశనములు, డోరు నెం. 3–59, సర్వే నెం.102, విస్తీర్ణం: యు.0–05 సెంట్లు గ్రామ కంఠం. ఐటం నెం–3: ఖాళీ నివేశన స్థలం, సర్వే నెం.95/9, విస్తీర్ణం యు.0–08 సెంట్లు. ఐటం నెం–4: కల్లం స్థలం, సర్వే నెం. 101/13 విస్తీర్ణం యు.0–11 సెంట్లు. ఐటం నెం–5: మెట్ట పొలం, సర్వే నెం. 97/11, విస్తీర్ణం యు.0–15 సెంట్లు. ఐటం నెం–6: మెట్ట పొలం, సర్వే నెం. 99/20, విస్తీర్ణం యు. 0–08 సెంట్లు. ఐటం నెం–7: మెట్ట పొలం, సర్వే నెం. 99/24, విస్తీర్ణం యు.0–10 సెంట్లు. ఐటం నెం–8: పల్లం భూమి, సర్వే నెం. 123/15, విస్తీర్ణం యు. 0–30 సెంట్లు. ఐటం నెం–9: పల్లం భూమి, సర్వే నెం. 123/17, విస్తీర్ణం యు.0–22 సెంట్లు. ఐటం నెం–10: పల్లం భూమి, సర్వే నెం. 123/18, విస్తీర్ణం యు. 0–21 సెంట్లు. ఐటం నెం–11: పల్లం భూమి, సర్వే నెం. 124/1, విస్తీర్ణం యు. 0–40 సెంట్లు. ఐటం నెం–12: పల్లం భూమి, సర్వే నెం. 124/9, విస్తీర్ణం యు.0–19 సెంట్లు.

పైన పేర్కొనబడిన భూమి, మరియు వివిధ సర్వే నెంబర్లతో గల ఆస్తిలో గల వివాదములు ఓ.ఎస్.నెం. 11/2023, ఐ.ఎ.నెం. 123/2023 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పరిష్కరించబడి యున్నది. కావున పైన తెలిపిన సర్వే నెంబర్లు గల ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు (అమ్మకాలు గాని, కొనుగోలు గాని) జరిపినచో వారు చట్టపరమైన చర్యలతో వారు బాధ్యులగుదురని అందుమూలంగా తెలియజేయుచున్నాను.

సం/-కె.భాస్కర ప్రసాద్, అడ్వకేట్, హైకోర్టు ఆఫ్ ఎ.పి.,